సాక్షి ఖమ్మం

బుధవారం । 5 । ఫిబ్రవరి । 2025



మరో మిథాలీ.. త్రిష

భారత జట్టు తరఫున క్రికెట్‌లో రాణించిన మిథాలీరాజ్, రాణిస్తున్న త్రిష స్ఫూర్తిగా జిల్లా బాలికలు తర్ఫీదు పొందుతున్నారు. 8లో



నిరంతర విద్యుత్ సరఫరా

ఉద్యోగులంతా సమష్టి కృషితో వేసవిలో నిరంతర విద్యుత్ సరఫరాకు కృషిచేయాలని ఎస్‌ఈ సురేందర్ సూచించారు. 8లో

గరిష్టం / కనిష్టం
35° / 17°

వాతావరణం

జిల్లాలో బుధవారం రోజంతా ఉక్కబోత వాతావరణం ఉంటుంది. సాయంత్రం తర్వాత కాస్త చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

డయల్ 100కు 4,056 ఫోన్లు

ఖమ్మంక్రైం: ప్రజలు తమ సమస్యలను చెప్పుకునేందుకు అందుబాటులో ఉన్న డయల్ 100కు జనవరి నెలలో 4,056 ఫోన్లు వచ్చాయని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. ఇందులో 57 ఫోన్లకు సంబంధించి ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామని ఓ ప్రకటనలో వెల్లడించారు. వీటిలో హత్యాయత్నం, మహిళలపై వేధింపులు, దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలు, అనుమానాస్పద మరణాలతో పాటు ఇతర కేసులు ఉన్నాయని తెలిపారు. అయితే, అత్యవసర పరిస్థితుల్లో మాత్రమే డయల్ 100కు ఫోన్ చేసి పోలీస్ సాయం పొందాలని సీపీ సూచించారు.

4.13 లక్షల క్వింటాళ్ల ధాన్యం కొనుగోళ్లు



మాట్లాడుతున్న డీసీఎంఎస్ చైర్మన్ కొత్వాల, పక్కన బిజినెస్ మేనేజర్ సందీప్

ఖమ్మంవ్యవసాయం: ఉమ్మడి జిల్లాలో గడిచిన వానాకాలం సీజన్‌కు సంబంధించి రూ.116.49 కోట్ల విలువైన 4.13 లక్షల క్వింటళ్ల వరి ధాన్యం కొనుగోళ్లు చేసినట్లు జిల్లా కోఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(డీసీఎంఎస్) చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు తెలిపారు. ఖమ్మంలోని కార్యాలయంలో మంగళవారం ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం జిల్లాలో 29 కేంద్రాల ద్వారా రూ.89.71 కోట్ల విలువైన 3.18 లక్షల క్వింటాళ్లు, భద్రాద్రి జిల్లాలో 11 కొనుగోలు కేంద్రాల ద్వారా రూ.26.78 కోట్ల విలువైన 94,960 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామన్నారు. గతంలో ఖమ్మం జిల్లాలో మాత్రమే ధాన్యం కొనుగోళ్లు చేపట్టగా, ఈసారి భద్రాద్రి జిల్లాలోనూ కేంద్రాలు ఏర్పాటుచేశామని తెలిపారు. వచ్చే ఏడాది ఉమ్మడి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను మరింతగా విస్తృత పరుస్తామని ఆయన వెల్లడించారు. డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా బిజినెస్ మేనేజర్ కె.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు త్రైమాసిక పన్ను చెల్లించాలి

ఖమ్మంక్రైం: జిల్లాలో త్రైమాసిక పన్ను(క్వార్టర్లీ) బకాయి ఉన్న వాహనదారులు వెంటనే చెల్లించాలని జిల్లా రవాణాశాఖాధికారి వెంకటరమణ సూచించారు. ఈవిషయమై తమ శాఖ ఉద్యోగులు స్పెషల్ డ్రైవ్ ద్వారా తనిఖీలు చేపడుతున్నారని తెలిపారు. పన్ను చెల్లించని వాహనదారులు పట్టుబడితే ట్యాక్స్‌కు రెండు రెట్ల జరిమానా విధిస్తామని ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

కొనసాగుతున్న ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

ఖమ్మంసహకారనగర్: ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. ఉదయం, మధ్యాహ్నం కలిపి 64 కేంద్రాల్లో జనరల్ విద్యార్థులకు, 14కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. ఉదయం 3,380 మందికి 3,247 మంది, మధ్యాహ్నం 2,941 మందిలో 2,846 మంది హాజరయ్యారని డీఐఈఓ రవిబాబు తెలిపారు. కాగా, పలు సెంటర్లను స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తనిఖీ



పీహెచ్‌సీ సిబ్బందికి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌ఓ

ముదిగొండ: మండలంలోని ముదిగొండ, వల్లభి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను డీఎంహెచ్‌ఓ డాక్టర్ కళావతిబాయి మంగళవారం తనిఖీ చేశారు. ఆయా పీహెచ్‌సీల్లో వైద్యులు, సిబ్బందితో సమావేశమైన ఆమె 19ఏళ్ల లోపు వారిలో నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీపై సూచనలు చేశారు. అలాగే, కేన్సర్ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సాధారణ ప్రసవాలతో లాభాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. ఈ తనిఖీల్లో డీఐఓ డాక్టర్ చందు నాయక్, డీపీఓ దుర్గ, వైద్యాధికారులు అరుణాదేవి, ధర్మేంద్ర, సీహెచ్‌ఓ మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సమరానికి రెడీ



దాదాపు ఏడాది విరామం తర్వాత జిల్లాలో మళ్లీ ఎన్నికల సందడి మొదలుకానుంది. గ్రామపంచాయతీలు, జిల్లా, మండల పరిషత్‌ల పాలకవర్గాల గడువు ముగిసి ఏడాది కావొస్తుండగా ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. అయితే, ఎన్నికల నిర్వహణకు రిజర్వేషన్లు ఖరారు కావడంతో ఈ ప్రక్రియ పూర్తవగానే షెడ్యూల్ విడుదల చేయనున్నారు. తొలుత జెడ్పీటీసీ, ఎంపీటీసీ.. ఆ తర్వాత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రచారం సాగుతోంది. దీంతో ఆశావహులు పోటీకి ఏర్పాట్లు చేసుకుంటూ ప్రజల్లోకి వెళ్తుండడంతో గ్రామాల్లో ఎన్నికల వాతావరణం నెలకొంది.

– సాక్షిప్రతినిధి, ఖమ్మం

- జెడ్పీటీసీ, ఎంపీటీసీలతో పాటు జీపీ ఎన్నికలకు ఏర్పాట్లు
- ఎన్నికల నిర్వహణపై నేడో, రేపో స్పష్టత
- బరిలో నిలిచేందుకు ఆశావహుల ఆరాటం
- జిల్లాలో వేడెక్కనున్న రాజకీయాలు

ఈసారి 288 ఎంపీటీసీ స్థానాల్లో..

పార్టీ గుర్తులతో జరిగే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలే మొదట నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని 289 ఎంపీటీసీ స్థానాలకు 2019 మే నెలలో ఎన్నికలు జరగ్గా.. ఆ పాలకవర్గాల గడువు తీరిపోయింది. ప్రస్తుతం ఎంపీటీసీ స్థానాల పునర్విభజన జరిగింది. ఖమ్మంరూరల్ మండలంలోని 10గ్రామ పంచాయతీలు కొత్తగా ఏర్పడిన ఏదులాపురం మున్సిపాలిటీలో విలీనమయ్యాయి. మరో రెండు జీపీల పరిధిలోని కొన్ని గ్రామాలనూ కలిపారు. దీంతో అక్కడ రెండు ఎంపీటీసీ స్థానాలు తగ్గినా రఘునాథపాలెం మండలం నుంచి మూడు గ్రామ పంచాయతీలు ఖమ్మం రూరల్‌లో కలవడంతో ఒక ఎంపీటీసీ స్థానం వచ్చింది. ఇలా ఖమ్మం రూరల్ మండలంలో ఒక స్థానం తగ్గినా ఎంపీటీసీ స్థానాల పునర్విభజనతో మరో స్థానం కొత్తగా ఏర్పడింది. దీంతో మొత్తం 288 ఎంపీటీసీ స్థానాలు, 20 జెడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

'పది' తగ్గిన జీపీలు

జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల తర్వాత గ్రామపంచాయతీ ఎన్నికలు నిర్వహించాలనే భావనలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే గ్రామాల్లో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. గతంలో 589 జీపీలు ఉండగా ఖమ్మంరూరల్ మండలం నుంచి పది జీపీలు కొత్తగా ఏర్పడిన ఏదులాపురం మున్సిపాలిటీలో విలీనమవడంతో 579 గ్రామపంచాయతీలకు ఎన్నికలు జరగాల్సి ఉంటుంది. జీపీ ఎన్నికలకు సంబంధించి రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు మొదలుపెట్టింది. ఇప్పటికే ఓటర్ల జాబితా సిద్ధం చేయగా, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, ఉద్యోగులకు శిక్షణపై దృష్టి పెట్టారు. ఈ ఎన్నికలకు రాజకీయ గుర్తులు ఉండకపోవడంతో పార్టీల మద్దతుతో అభ్యర్థులు బరిలో నిలవనున్నారు.

రిజర్వేషన్లు కొలిక్కి వస్తేనే..

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రిజర్వేషన్లు అడ్డంకిగా మారాయి. 2019లో జరిగిన ఎన్నికల రిజర్వేషన్లే ఈసారి కూడా వర్తించాలి. కానీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక చట్టాన్ని సవరించగా, పంచాయతీరాజ్ చట్టసవరణ బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం లభించింది. దీంతో రిజర్వేషన్లు మార్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మేరకు రిజర్వేషన్లు ఖరారు కాగానే ఎన్నికల సంఘం నుంచి షెడ్యూల్ విడుదలవుతుందని సమాచారం. అయితే, ప్రస్తుతం ఖరారు చేసే రిజర్వేషన్లు ఈ ఎన్నికల వరకే వర్తిస్తాయి.

నిలిచి గెలవాలని..

పార్టీలు, ముఖ్యనేతల కోసం పనిచేస్తున్న కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులు ఎన్నికల బరిలో నిలవాలనే పట్టుదలతో ఉన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ, గ్రామపంచాయతీ ఇలా ఎక్కడ అవకాశం దొరికినా పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. అందుకు కావాల్సిన ఏర్పాట్లను చేసుకుంటూనే గ్రామాల్లో తెలిసిన వారు, కార్యకర్తలను తరచుగా కలిసి తాము బరిలోకి దిగితే మద్దతు ఇవ్వాలని కోరుతున్నారు. అయితే ఇంకా రిజర్వేషన్లు ఖరారు కాకపోవడంతో స్థానిక పరిస్థితులను అంచనా వేసి పోటీ చేయాలని భావిస్తున్నారు. పార్టీ గుర్తులతో పోటీ చేసినా.. పార్టీ రహితంగా పోటీ అయినా తమ పార్టీ మద్దతు కూడగట్టుకునే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు.

గ్రామాల్లో ఎన్నికల సందడి

స్థానిక ఎన్నికల నగారా మోగనున్న నేపథ్యాన మళ్లీ రాజకీయ పార్టీల హడావుడి మొదలు కానుంది. జిల్లా, మండలస్థాయి నేతల ప్రచారాలు, విమర్శలు, ప్రతివిమర్శలతో గ్రామాలు హోరెత్తనున్నాయి. అసెంబ్లీ ఎన్నికలు జరిగి ఏడాది పూర్తయిన క్రమాన పార్టీలు ఈ ఎన్నికలపై దృష్టి సారించేలా సిద్ధమవుతున్నాయి. జిల్లాలో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటిన కాంగ్రెస్ పట్టు నిలుపుకోవాలని... ఇక్కడైనా ప్రాభవాన్ని దక్కించుకునేందుకు బీఆర్‌ఎస్, కమ్యూనిస్టు పార్టీల నేతలు ఈ ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోనున్నారు. అయితే, షెడ్యూల్ విడుదల కాకున్నా ఎన్నికల నిర్వహణపై సంకేతాలు వస్తుండడంతో గ్రామాల్లో వాతావరణం సందడిగా మారింది. పార్టీల ముఖ్యనేతలు పర్యటించినప్పుడు ఆశావహులు వారి దృష్టిలో పడేలా హడావుడి చేస్తున్నారు.

ఉన్నత స్థాయికి చేరడమే లక్ష్యం..

- అందుకోసం శ్రమిస్తే విజయం
- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



ర్యాంకు సాధించిన విద్యార్థినికి స్వీట్ తినిపిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంఅర్బన్: విద్యార్థినులు జీవితంలో ఉన్నత స్థానానికి చేరడమే లక్ష్యంగా పెట్టుకుని అందివచ్చే అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగితే సాధించడం కష్టమేమీ కాదని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. ఖమ్మంలోని మహిళా ప్రాంగణం విద్యార్థినులు ఎంపీహెచ్‌డబ్ల్యూ(మల్టీ పర్పస్ హెల్త్‌వర్కర్) ఫలితాల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రతిభ కనబర్చగా కలెక్టర్ మంగళవారం అభినందించారు. రాష్ట్ర స్థాయిలో మొదటి సంవత్సరం తొలి పది ర్యాంకుల్లో 1,6, 8, 10 ర్యాంకులు, రెండో సంవత్సరం విద్యార్థినులు రాష్ట్ర స్థాయిలో 2నుంచి 12వరకు ర్యాంకులు, జిల్లా స్థాయిలో మొదటి పది ర్యాంకులను మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు సాధించడం అభినందనీయమన్నారు. ఈ కోర్సు ఆధారంగా ఉన్న అవకాశాలు, ఏ రంగాల్లో ఎదగవచ్చో అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈకార్యక్రమంలో మహిళా ప్రాంగణం మేనేజర్ విజేత, ఉద్యోగులు నాగసరస్వతి, స్పందన, హిమబిందు, మల్లిక, విజయ్‌కుమార్, సుకన్య, మౌనిక, లాలయ్య, దుర్గారావుతో పాటు ర్యాంకులు సాధించిన విద్యార్థినులు పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై దృష్టి..

ఖమ్మంసహకారనగర్: జిల్లాలోని పర్యాటక ప్రాంతాల చరిత్ర, ప్రత్యేకతలు ప్రతిబింబించేలా అభివృద్ధి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ, కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి ఆయన క్యాంపు కార్యాలయంలో పురావస్తు, పర్యాటక శాఖ అధికారులతో సమీక్షించారు. నేలకొండపల్లిలోని బౌద్ధస్తూపం, పాలేరు రిజర్వాయర్, ఖమ్మం ఖిల్లా వద్ద అభివృద్ధి పనులు చేపట్టే క్రమాన సిమెంట్ కాకుండా ప్రత్యామ్నాయ సామగ్రి ఉపయోగించాలని తెలిపారు. బౌద్ధస్తూపం వద్ద ఓపెన్ ఎయిర్ మ్యూజియం, వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. అలాగే, పాలేరు రిజర్వాయర్, పార్కుల వద్ద టాయిలెట్ బ్లాక్‌ల నిర్మాణం చేపట్టి బోటింగ్ అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ఖిల్లా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటుచేయాలని, రోప్‌వే నిర్మాణానికి అడ్డంకులను అధిగమించాలని సూచించారు. ఈ సమావేశంలో ఖమ్మం ఆర్డీఓ నర్సింహారావు, ఆర్కిటెక్చర్ వి.సత్యశ్రీనివాస్, సీనియర్ ఇంజనీర్ వెంకటేష్, టూరిజం శాఖ డీఈలు ఎస్.రామకష్ణ, ఎం.వీ.శ్రీధర్, పురావస్తు శాఖ ఏడీలు బి.మల్లు నాయక్, ఎన్.నర్సింగ్ పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ ఉద్యోగుల్లో ఆడిట్ గుబులు



జెడ్పీ ఉద్యోగులతో మాట్లాడుతున్న ఆడిట్ అధికారులు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ అధికారులు, ఉద్యోగుల్లో ఆడిట్ గుబులు పట్టుకుంది. ఏ శాఖలోనైనా ఏడాది, రెండేళ్లకోసారి ఆడిట్ జరుగుతుంది. ఇందులో భాగంగానే గతేడాది సెప్టెంబర్ – అక్టోబర్‌లో డీఆర్‌డీఏలో ఉపాధి హామీ పథకం పనులపై జనరల్ ఆడిట్ నిర్వహించారు. అయితే జిల్లా అధికారులు, ఉద్యోగులు సరైన నివేదికలు ఇవ్వకపోవడంతో మరోసారి ఆడిట్ అధికారులు వచ్చారు. ఈమేరకు మంగళవారం టీటీడీసీ భవనంలో సమావేశమైన అధికారులు తమకు అనుమానాలు ఉన్న పనులకు సంబంధించి ఫైళ్లను పరిశీలించారు. డీఆర్‌డీఏ ఉద్యోగులతో పాటు అనుబంధంగా ఉండే పంచాయతీ, జెడ్పీ ఉద్యోగులను సైతం పిలిపించి వివరాలు సేకరించడం గమనార్హం. నాలుగు నెలల్లోనే రెండో సారి ఆడిట్ అధికారులు రావడంతో ఉద్యోగులు ఆందోళన చెందుతున్నట్లు సమాచారం. జిల్లాలో ఉపాధి హామీ పనులపై పలు ఆరోపణలు రావడం, నివేదికల్లో లోపాలు ఉండడంతోనే అధికారులు మరోమారు పరిశీలనకు వచ్చినట్లు తెలిసింది.

7న ఎమ్మెల్సీ ఓటర్ల తుదిజాబితా

- ఎన్నికలకు 27మంది నోడల్ ఆఫీసర్లు
- జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాల ఖరారు

ఖమ్మంసహకారనగర్: వరంగల్–ఖమ్మం– నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లలో వేగం పెరిగింది. ఇక్కడ ఎమ్మెల్సీగా ఉన్న అలుగుబెల్లి నర్సిరెడ్డి పదవీ కాలం వచ్చేనెల 29తో ముగియనుంది. ఇప్పటికే నామినేషన్ల స్వీకరణ మొదలవడంతో ఈనెల 27న జరిగే పోలింగ్‌కు అధికారులు సిద్ధమవుతున్నారు. గతనెల 31న ఓటరు జాబితా విడుదల చేయగా మళ్లీ దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. వీటి పరిశీలన అనంతరం ఈనెల 7న ఓటర్ల తుది జాబితా ఖరారవుతుంది.

21మండలాలు.. 24 కేంద్రాలు

జిల్లాలోని 21మండలాల పరిధిలో ఎన్నికల నిర్వహణకు 24పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. కేంద్రాలను ఎనిమిది సెక్టార్లుగా విభజించి ప్రతీ సెక్టార్‌కు అధికారులను నియమించారు. అలాగే ఉద్యోగుల నియామకం కూడా పూర్తయింది. ఎంపిక చేసిన 21 మంది నోడల్ ఆఫీసర్లకు అధికారులు మాధవి, రాజేశ్వరి మాస్టర్ ట్రెయినీలుగా శిక్షణ ఇస్తున్నారు. అనంతరం నోడల్ ఆఫీసర్లు మిగతా సిబ్బందికి శిక్షణ ఇస్తారు. కాగా, పోలింగ్ అధికారులు(పీఓలు)గా 28 మంది వ్యవసాయాధికారులు, ఏపీఓలుగా 27 మంది డీటీలు, ఓపీఓలుగా సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు, గిర్దావర్లు 52 మందిని నియమించారు. అంతేకాక ముందస్తుగా మరికొందరిని రిజర్వ్‌గా ఎంపిక చేశారు. ఎన్నికల ఏర్పాట్లను అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, డీఆర్‌ఓ పద్మశ్రీ పర్యవేక్షిస్తున్నారు. ఎన్నికల సామగ్రి భద్రపరిచేందుకు ట్రెజరీ కార్యాలయంలో స్ట్రాంగ్ రూమ్ ఏర్పాటుచేయగా, ఖమ్మం కలెక్టరేట్‌లోనే ఉద్యోగులకు సామగ్రి పంపిణీ, స్వీకరణ ఉంటుంది.

ఉపాధ్యాయుల్లో సందడి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యాన ఉపాధ్యాయ సంఘాల్లో హడావుడి నెలకొంది. ఇప్పటికే నామినేషన్ల స్వీకరణ మొదలుకాగా, ఈనెల 27న పోలింగ్ నిర్వహిస్తారు. దీంతో ఉపాధ్యాయులు ఎక్కడ కలిసినా ఎన్నికలపైనే చర్చ జరుగుతోంది. ఈసారి ఎవరెవరు బరిలో ఉన్నారు, గతంలో ఎమ్మెల్సీగా పనిచేసిన అభ్యర్థి ఏమేం చేశారు, ఈసారి ఎవరికి ఓటు వేయాలి, తమ సంఘం మద్దతు ఎవరికి ఉందనే అంశంపై చర్చిస్తున్నారు.

ముగ్గురి హత్య కేసులో జీవితఖైదు

- మద్యంలో విషం కలిపిన నిందితుడు
- చంద్రుతండా ఘటనలో తీర్పు వెలువరించిన కోర్టు



ఖమ్మం లీగల్: తిరుమలాయపాలెం మండలం చంద్రుతండాలో భూమి గొడవలు, ఇతర తగాదాల నేపథ్యాన మద్యంలో విషం కలిపి ముగ్గురి మృతికి కారణమైన వ్యక్తికి జీవితకాలం శిక్ష విధిస్తూ తీర్పు వెలువడింది. ఎస్సీ, ఎస్టీ జిల్లా ప్రత్యేక న్యాయస్థానం న్యాయాధికారి డి.రాంప్రసాద్ మంగళవారం ఇచ్చిన ఈ తీర్పు వివరాలిలా ఉన్నాయి.

కర్మకు పిలిచి మద్యం తాగించి

చంద్రుతండాకు చెందిన బోడ భిక్షం కుటుంబానికి బోడ మల్సూర్ కుటుంబానికి పొలం పంచాయితీతో పాటు ఇతర గొడవలు ఉన్నాయి. కాగా, భిక్షం కుమారుడు అర్జున్ మృతి చెందగా 2021 ఆగస్టు 14న కర్మకాండ నిర్వహించారు. మధ్యాహ్నం గ్రామస్తులందరినీ విందుకు పిలవగా సాయంత్రం సైతం మరికొందరిని ఆహ్వానించారు. ఈక్రమంలోనే బోడ హరిదాసు, ఆయన సోదరుడు మల్సూర్, మరో సోదరుడి కుమారుడు భద్రు పొలానికి వెళ్లొచ్చాక భోజనానికి చేరుకున్నారు. అయితే, భిక్షం మరో కుమారుడైన బోడ చిన్నా అలియాస్ బిచ్చా భోజనానికి ముందు మద్యం పోయడంతో ముగ్గురూ తాగారు. ఆపై పావుగంటకే వారు ముగ్గురూ మద్యంలో విషం కలిసిందని అరుస్తూ పడిపోయారు. దీంతో మహబూబాబాద్ జిల్లా మరిపెడ బంగ్లాకు, అక్కడి నుంచి ఖమ్మం ఆస్పత్రికి తీసుకొస్తుండగా ముగ్గురు మృతి చెందారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు చిన్నాతో పాటు మరో నలుగురిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఇరవై మంది సాక్షులను విచారించి మొదటి ముద్దాయి అయిన చిన్నాపై నేరం రుజువైందని ప్రకటిస్తూ నలుగురిపై నేరం రుజువు కాకపోవడంతో నిర్దోషులుగా న్యాయమూర్తి వెల్లడించారు. ఈక్రమాన చిన్నాకు జీవితకాలం జైలుశిక్షతో పాటు రూ.30 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి.కృష్ణమోహన్‌రావు వాదించగా పోలీసు శాఖ ఉద్యోగులు శ్రీకాంత్, నాగేశ్వరరావు, భద్రాజీ, పాషా సహకరించారు.

సూర్య భగవాన్.. నమోనమామి



గుంటు మల్లన్న ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు

రథ సప్తమిని పురస్కరించుకుని మంగళవారం జిల్లావ్యాప్తంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇళ్లు, ఆలయాల్లో ఆవు నెయ్యితో దీపారాధన చేయగా, ముత్తయిదవలు నోములు, వ్రతాలు ఆచరించారు. ఖమ్మంలోని శ్రీ భ్రమరాంబ సమేత శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవస్థానంలో సూర్య భగవానుడికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ చుండూరు రామకోటేశ్వరరావు పర్యవేక్షణలో అర్చకులు దాములూరి వీరభద్రరావు, దాములూరి కృష్ణశర్మ పూజలు నిర్వహించగా, శ్రీ స్తంభాద్రి లక్ష్మీనరసింహ స్వామి ఆలయం, కమాన్‌బజార్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లోనూ ప్రత్యేక పూజలు జరిగాయి.

– ఖమ్మంగాంధీచౌక్

మహా కుంభాభిషేకానికి ముస్తాబు

- పెద్దమ్మతల్లి ఆలయంలో రేపటి నుంచి వేడుకలు
- ఐదు రోజుల పాటు పంచమ పుష్కర ఉత్సవాలు



విద్యుత్‌కాంతులతో శోభిల్లుతున్న ఆలయం



పెద్దమ్మతల్లి అమ్మవారు

పాల్వంచరూరల్ : కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా, భక్తులకు వరాలు ఇస్తూ చల్లగా చూసే అమ్మగా పేరుగాంచిన పాల్వంచ మండల పరిధిలోని శ్రీ పెద్దమ్మతల్లి అమ్మవారిని నిత్యం వందలు మొదలు వేలాది మంది భక్తులు దర్శించుకుంటారు. ముఖ్యంగా గురు, ఆదివారాలతో పాటు పండుగ రోజుల్లో వేల సంఖ్యలో తరలివస్తుంటారు. ఈ అమ్మవారి ఆలయం నిర్మించి 64 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా గురువారం నుంచి ఐదు రోజుల పాటు పంచమ పుష్కర (షష్టాబ్ది) ఉత్సవాలు, మహా కుంభాభిషేకం నిర్వహించనున్నారు. అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్టే అని విశ్వసించే వేలాది మంది భక్తులు ఈ ఉత్సవాలకు తరలిరానున్నారు. ఇందుకోసం ఆలయ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

పూజా కార్యక్రమాలు ఇలా..

6వ తేదీ ఉదయం 6 గంటలకు మంగళతోరణాలతో ఆలయాన్ని అలంకరిస్తారు. 9 గంటలకు విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచనం, అఖండ దీపారాధన, దీక్షాధారణ, గోపూజ వంటివి నిర్వహిస్తారు. స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరై ఈ పూజా కార్యక్రమాలను ప్రారంభిస్తారు. ఆ తర్వాత విశేష పూజలు, అర్చనలు ఉంటాయి. 7వ తేదీ తెల్లవారుజాము నుంచి పుణ్యాహవాచనం, అగ్నిమథనం, అగ్నిప్రతిష్ఠ, మూలమంత్ర హోమాలు జరుగుతాయి. అమ్మవారి సన్నిధి పక్కనే నిర్మించిన శివాలయంలో ప్రతిష్ఠామూర్తులకు జలాధివాసం చేయనున్నారు. శివాలయంతో పాటు పక్కన నిర్మించిన అన్నదాన సత్రం, యాగశాల, కల్యాణ మండపం భక్తులను ఆకట్టుకునేలా ఉన్నాయి.

విద్యుత్ దీపాలతో అలంకరణ..

మండల పరిధిలోని కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య శ్రీ కనకదుర్గ(పెద్దమ్మతల్లి) ఆలయాన్ని 1961లో నిర్మించారు. ఇప్పటికి 64 ఏళ్లు పూర్తి కావస్తున్న సందర్భంగా అవధానులు పరమేశ్వరప్రసాద్, శివసంతోష్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో మహా కుంభాభిషేక మహోత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జిల్లా వ్యాప్తంగా వాల్‌పోస్టర్లు, కరపత్రాలతో పాటు ప్రత్యేక రథం ద్వారా ప్రచారం చేశారు. వేడుకల కోసం ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. దీంతో ఈ ప్రాంతంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

కలెక్టరేట్ గార్డెన్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న మధుసూదన్

కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచనలతో కలెక్టరేట్ ఆవరణలో రకరకాల పూలతో గార్డెన్‌ను తీర్చిదిద్దగా ఉన్నతాధికారుల ప్రశంసలు దక్కాయి. రాష్ట్ర ఉద్యాన శాఖ ఆధ్వర్యాన హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన గార్డెనింగ్ ఫెస్టివల్‌లో ఖమ్మం కలెక్టరేట్ గార్డెన్‌కు అవార్డు ప్రకటించారు. రాష్ట్ర ఉద్యాన శాఖ కమిషనర్ యాస్మిన్ బాషా చేతుల మీదుగా జిల్లా ఉద్యాన అధికారి మధుసూదన్ అవార్డు అందుకోగా, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అభినందించారు.

– ఖమ్మం వ్యవసాయం



క్లుప్తంగా

జాతీయస్థాయి పోటీలకు టెక్నికల్ పర్సన్‌గా రాజశేఖర్


రాజశేఖర్

ఎర్రుపాలెం: హైదరాబాద్‌లోని సీఆర్పీఎఫ్ పాఠశాల పీడీ, బనిగండ్లపాడుకు చెందిన కూరపాటి రాజశేఖర్ జాతీయ అథ్లెటిక్స్ పోటీలకు టెక్నికల్ పర్సన్‌గా ఎంపికయ్యారు. ఈ నెల 12 నుంచి డెహ్రాడూన్‌లో జరగనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఆయన సాంకేతిక నిపుణుడిగా వ్యవహరిస్తారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌ను మధిర మార్కెట్ చైర్మన్ బండారు నర్సింహారావు, సొసైటీ చైర్మన్ శీలం అక్కిరెడ్డి, పీఈటీలు కోనా రమేశ్, నండ్రు విజయ్‌భాస్కర్, గూడూరు సత్యనారాయణరెడ్డి, నరాల సాంబశివారెడ్డి, తలపురెడ్డి గోపిరెడ్డి, రాజవరపు శ్రీనివాసరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డితో పాటు యన్నం పిచ్చిరెడ్డి అభినందించారు.

మహిళా సంఘాలు అన్ని రంగాల్లో ముందుండాలి

ముదిగొండ: మహిళా సంఘాల్లోని సభ్యులు అన్ని రంగాల్లో ముందు నిలుస్తూ ఆర్థికాభివృద్ధి సాధించాలని డీఆర్‌డీఓ ఆర్.సన్యాసయ్య సూచించారు. ముదిగొండలోని స్త్రీ శక్తి భవనంలో మంగళవారం స్వయంకృషి మండల మహిళా సమాఖ్య బాధ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఆర్‌డీఓ మాట్లాడుతూ స్త్రీనిధి, బ్యాంకుల ద్వారా అందే రుణాలతో కుటీర పరిశ్రమలు స్థాపించుకోవాలని తెలిపారు. తద్వారా ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. అనంతరం మహిళా శక్తి స్టాళ్లను ఆయన పరిశీలించారు. డీపీఎంలు దుర్గయ్య, శ్రీను, రాజారావు, సీసీలు రామారావు, అనురాధ, నాగేశ్వరరావు, సైదులు, రాజేశ్వరి, హరికృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థికి పీఎం నుంచి అభినందన పత్రం

తల్లాడ: తల్లాడలోని బాలభారతి విద్యాలయంలో గత విద్యాసంవత్సరం పదో తరగతి పూర్తిచేసిన అన్నారుగూడెంకు చెందిన తోట అజయ్‌కు మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నుంచి అభినందన పత్రం అందింది. వికసిత భారత్‌లో భాగంగా గుజరాత్‌లోని వాద్రానగర్‌లో నిర్వహించిన ప్రేరణ కార్యక్రమంలో అజయ్ పాల్గొన్నారు. ఈమేరకు ప్రధానమంత్రి నుంచి అభినందన పత్రంతో రానున్న రోజుల్లో మరింత ప్రదర్శన ఇవ్వాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థినిని పాఠశాల కరస్పాండెంట్ కోటగిరి ప్రవీణ్, కేఎస్ఎం ప్రిన్సిపాల్ టి.రామారావు, ఇన్‌చార్జి వై.శశాంక్ తదితరులు అభినందించారు.

సోలార్ ప్లాంట్ సమీపాన గుట్టపై మంటలు

కారేపల్లి: ఇల్లెందు – సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి సరిహద్దుల్లో ఉన్న సోలార్ ప్లాంట్ సమీపాన గుట్టపై మంగళవారం రాత్రి మంటలు చెలరేగాయి. గుట్టపై ఎండిన కొమ్మలు, ఆకులకు నిప్పంటుకోవడంతో మంటలు ఎగిసిపడ్డాయి. సమీపాన సోలార్ ప్లాంట్ ఉండటంతో అప్రమత్తమైన అధికారులు అగ్నిమాపక శాఖకు సమాచారం ఇచ్చి సిబ్బంది సాయంతో మంటలను అదుపు చేసేందుకు శ్రమిస్తున్నారు. అయితే, గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారా లేక ఘటనకు ఇతర కారణాలు ఉన్నాయా అనేది తెలియరాలేదు.

ద్విచక్ర వాహనం ఢీకొని చిన్నారికి గాయాలు


ఖమ్మంఅర్బన్: ఖమ్మంలోని కొత్తగూడెంలో ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో పాఠశాల నుండి ఇంటికి వస్తున్న విద్యార్థినికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామంలోని జంగాల కాలనీకి చెందిన జి.మహేష్ – పార్వతి దంపతుల కుమార్తె సంజన ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతి చదువుతోంది. పాఠశాల ముగిశాక ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లే తండ్రి మంగళవారం రాకపోవడంతో తమ ఇంటివైపే వెళ్తున్న మరో వాహనదారుడుని లిఫ్ట్ అడిగింది. ఇంటి వద్ద దిగాక రోడ్డు దాటుతున్న సమయాన వేగంగా వచ్చిన మరో ద్విచక్ర వాహనదారుడు ఢీకొట్టడంతో సంజన తీవ్రంగా గాయపడగా ఆస్పత్రికి తరలించారు. ఘటనపై ఆమె తండ్రి ఖమ్మం అర్బన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

ఖమ్మంక్రైం: ఖమ్మం రైల్వేస్టేషన్ పరిధిలో గుర్తుతెలియని వ్యక్తి(35) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఖమ్మం –పందిళ్లపల్లి స్టేషన్ మధ్య సదరు వ్యక్తి రైలు కింద తలపెట్టడంతో మృతి చెందాడు. అయితే, మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని, కుడిచేయి దండపై అమ్మ అని పచ్చబొట్టు ఉందని జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 98481 14202 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు. కాగా, మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మార్చురీకి తరలించారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.20,487

మరో మిథాలీ.. త్రిష


సర్దార్ పటేల్ స్టేడియంలో క్రికెట్ ప్రాక్టీస్ చేస్తున్న బాలికలు

జిల్లాలో క్రికెట్‌పై బాలికల మక్కువ

- పటేల్ స్టేడియంలో క్రమం తప్పకుండా ప్రాక్టీస్
- ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తా

ఖమ్మం స్పోర్ట్స్: భారత దేశ జట్టులో స్థానం దక్కడమే గొప్పగా భావించి తరుణంలో సత్తా చాటిన మిథాలీరాజ్.. ఇటీవల తన పేరు మార్మోగేలా అండర్–19 టీ–20 వరల్డ్ కప్‌లో భారత జట్టు తరఫున సత్తా చాటిన భద్రాచలానికి చెందిన గొంగడి త్రిష స్ఫూర్తిగా జిల్లాలో బాలికలు క్రికెట్‌పై మక్కువ కనబరుస్తున్నారు. అథ్లెటిక్స్, కబడ్డీ, ఖో–ఖో తదితర క్రీడాంశాల్లో జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు ఇప్పటికే ప్రతిభ కనబరుస్తుండగా క్రికెట్‌లోనూ బాలికలు మెరికల్లా రూపుదిద్దుకుంటున్నారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ప్రాక్టీస్ చేస్తున్న వారిలో పలువురు ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో సత్తాచాటారు. ఈనేపథ్యాన త్రిష తన ప్రతిభతో నలుదిశలా జిల్లా ఖ్యాతిని చాటిన క్రమంలో క్రీడాకారులను పలకరించగా తాము సైతం మిథాలీరాజ్, త్రిష స్ఫూర్తితో భారత జట్టులో స్థానమే లక్ష్యంగా కృషి చేస్తున్నామని వెల్లడించారు.

ఎంతో ఓర్పుతో ఆడింది



అపారమైన అనుభవం కలిగిన క్రికెటర్ మాదిరి త్రిష నైపుణ్యాన్ని ప్రదర్శించింది. నిత్యం ప్రాక్టీస్‌తో పాటు కృషి, పట్టుదల ఆమె విజయానికి కారణమయ్యాయి. భవిష్యత్‌లో మరో మిథాలీరాజ్ అవుతుందనే నమ్మకముంది.

– శివ, క్రికెట్ కోచ్

ఆమె విజయాలే స్ఫూర్తి



ఉమ్మడి జిల్లా నుంచి భారత జట్టులో తొలిసారి స్థానం పొందడమేకాక అత్యుత్తమ ఆటతీరుతో త్రిష మాకు స్ఫూర్తిగా నిలుస్తుంది. ఆమె విజయాలే ప్రేరణగా ప్రాక్టీస్ చేస్తాం. భారత జట్టులో స్థానమే లక్ష్యంగా కృషి చేస్తాం.

– ఎం.గిరిజ, ఖమ్మం

మేం ఉన్నతంగా ఎదిగేలా..



త్రిష బ్యాటింగ్‌లో కొత్తదనాన్ని చూపించింది. ప్రతీ మ్యాచ్‌లో అనూహ్యంగా పరుగులు సాధించి జట్టు విజయంలో కీలక పాత్ర పోషించింది. మేం ఉన్నత స్థాయికి ఎదిగేలా ఆమె మాకు ఎల్లవేళలా స్ఫూర్తిగా నిలుస్తుంది.

– వి.అనన్య, ఖమ్మం

స్థానం దక్కే వరకు శ్రమిస్తా



భవిష్యత్‌లో అగ్రశ్రేణి క్రికెటర్ల జాబితాలో త్రిష నిలుస్తుంది. మిథాలీరాజ్ మాదిరిగానే త్రిష బ్యాటింగ్ స్టైల్ ఉంది. ఓర్పుతో బ్యాటింగ్ చేయడం కలిసొచ్చే అంశం. భారత జట్టులో స్థానం దక్కే వరకు నేనూ కష్టపడతా.

– అంజలి, జాతీయ క్రికెటర్, ఖమ్మం

త్రిషతో ప్రాక్టీస్ చేయాలని ఉంది..



త్రిష ఖమ్మం వస్తే ఆమెతో ప్రాక్టీస్ చేస్తా. వరల్డ్ కప్‌లో దేశం తరఫున ఆడి తన ఆటతీరుతో అందరి చేత జేజేలు కొట్టించుకోవడం గొప్ప విషయం. నేనూ జాతీయస్థాయి క్రీడాకారిణిగా ఎదుగుతాననే నమ్మకంతో ఉన్నా.

– కె.మనస్వి, ఖమ్మం

పులిగుండాల.. భళా!


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పీసీసీఎఫ్ సువర్ణ

పెనుబల్లి/కల్లూరు: అటవీ శాఖ అధికారులు పెనుబల్లి మండలం తాళ్లపెంట అటవీప్రాంతంలో ఉన్న పులిగుండాల ప్రాజెక్టును సందర్శించారు. ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్(పీసీసీఎఫ్) డాక్టర్ సువర్ణతో పాటు సీపీఎఫ్ భీమానాయక్, ఖమ్మం డీఎఫ్ఓ సిద్ధార్థ విక్రమ్‌సింగ్ పులిగుండాల ప్రాంతంతో పాటు హస్తాల వీరన్న గుట్ట ఏరియా, లెపార్డ్ టవర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా పీసీసీఎఫ్ సువర్ణ మాట్లాడుతూ ప్రాజెక్టు పరిసరాలు, అటవీ సంపద అద్భుతంగా ఉన్నందున అద్భుత పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. అనంతరం అభివృద్ధికి ఉన్న అవకాశాలు, చేయాల్సిన పనులపై సమీక్షించారు. కాగా, కల్లూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు వనదర్శినిలో భాగంగా పులిగుండాల ప్రాజెక్టు వద్దకు రాగా, ఇక్కడి ప్రత్యేకతలు, ఔషధ మొక్కలు, జంతువుల ఆవాసాలపై అవగాహన కల్పించారు. సత్తుపల్లి ఎఫ్‌డీఓ మంజుల, ఎఫ్ఆర్ఓ ఉమ, అటవీ శాఖ ఉద్యోగులు రాంసింగ్, భరత్‌కుమార్, అజ్మాహెల్, భీమా, ఉపేంద్రయ్య, సురేష్, విద్యాశాఖ సీఎంఓ రాజశేఖర్, ఎంఈఓ పత్తిపాటి నివేదిత, పీఈటీ పసుపులేటి వీరరాఘవయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి వేళ ప్రత్యేక తనిఖీలు

ద్విచక్రవాహనదారులపై కేసులు, బైక్‌ల సీజ్


స్వాధీనం చేసుకున్న బైక్‌లు, పట్టుబడిన యువకులతో టూటౌన్ పోలీసులు

ఖమ్మంక్రైం: ఏ అవసరం లేకున్నా అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు రహదారులపై ఇద్దరు, ముగ్గురు కలిపి బైక్‌లపై అతివేగంగా వెళ్తూ ఇతర వాహనదారులకు ఇబ్బందిగా మారుతున్న యువకులను కట్టడి చేయడంపై పోలీసులు దృష్టి సారించారు. సీపీ సునీల్‌దత్ ఆదేశాల మేరకు నగర ఏసీపీ రమణమూర్తి ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలోని అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలో సోమవారం రాత్రి ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈనేపథ్యాన ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓవర్‌స్పీడ్‌తో వెళ్తున్న 14మందిపై న్యూసెన్స్ కేసు నమోదు చేసి ఏడు వాహనాలను సీజ్ చేసినట్లు సీఐ బాలకృష్ణ తెలిపారు. అలాగే, వన్ టౌన్ పరిధిలో పది మందిపై కేసు నమోదు చేసి ఐదు వాహనాలను సీజ్ చేయగా, త్రీటౌన్ పరిధిలో గొడవలకు పాల్పడుతూ రాత్రివేళ రహదారులపై తిరుగుతున్న 10మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐలు ఉదయ్‌కుమార్, రమేష్ వెల్లడించారు. ఈ తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, అవసరం లేకున్నా రహదారులపైకి వచ్చి న్యూసెన్స్‌కు పాల్పడే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అలాగే, మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపైనా కేసులు నమోదవుతాయని తెలిపారు.

ఐసీడీఎస్ జూనియర్ అసిస్టెంట్ మృతి


ఎండీ యాకూబ్ పాషా (ఫైల్)

దమ్మపేట: మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఎండీ యాకూబ్ పాషా (48) గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం ఆయన కల్లూరులోని నివాసంలో ఉండగా గుండెపోటు రావడంతో మృతి చెందారు. కాగా, ఆయన 2022 నుంచి దమ్మపేటలో విధులు నిర్వర్తిస్తున్నారు. విషయం తెలుసుకున్న సీడీపీఓ హేమ సత్య ఆయన మృతదేహాన్ని సందర్శించి తక్షణ ఆర్థిక సాయంగా రూ.30,000 మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. సీడీపీఓతో పాటుగా సూపర్‌వైజర్లు శ్రీదేవి, నాగమణి, సామ్రాజ్యం, జ్ఞానసుందరి పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి...

ఖమ్మంఅర్బన్: ఖమ్మం ధంసలాపురం కాలనీకి చెందిన కార్మికుడు జి.రాము(45) రోడ్డు ప్రమాదంలో గాయపడగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సిమెంట్ దుకాణంలో పనిచేసే ఆయన గత శనివారం పని ముగించుని ద్విచక్ర వాహనంపై వస్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయపడిన రాముకు చికిత్స చేయిస్తుండగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం అర్బన్ పోలీసులు తెలిపారు.

రూ.6.90లక్షల విలువైన బంగారం చోరీ

వెండితో పాటు రూ.3.25లక్షల నగదు కూడా..

ఖమ్మంరూరల్: మండలంలోని సత్యనారాయణపురం శివారు సాయినగర్–2లో నివాసముండే పగడాల నాగేశ్వరరావు ఇంట్లో మంగళవారం భారీ చోరీ జరిగింది. ఆయన తన కుమార్తెను చూడడానికి సోమవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చేసరికి ముందు భాగంలో తలుపులు వేసినట్లే ఉన్నాయి. ఈమేరకు వారు లోపలికి వెళ్లి చూడగా వెనక తలుపులు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించిన దుండగులు చోరీ చేసినట్లు గుర్తించారు. బీరువాలో భద్రపర్చిన రూ.6.90లక్షల విలువైన 23 తులాల బంగారు ఆభరణాలు, 30 తులాల వెండితో పాటు రూ.3.25 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఈమేరకు సీఐ ముష్క రాజు క్లూస్‌టీంతో వెళ్లి ఇంటి పరిసరాలను పరిశీలించి కేసు దర్యాప్తు ప్రారంభించారు.

పంట వివరాల నమోదులో వేగం పెంచాలి


బోనకల్ : ఉద్యోగులతో సమీక్షిస్తున్న డీఏఓ పుల్లయ్య

బోనకల్/చింతకాని: జిల్లాలో రైతులు సాగు చేస్తున్న పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండగా ఉద్యోగులు పారదర్శకంగా ప్రక్రియ చేపడుతూనే వేగం పెంచాలని జిల్లా వ్యవసాయాధికారి ధనసరి పుల్లయ్య సూచించారు. చింతకాని రైతు వేదికలో ఆయన మంగళవారం ఏఈఓలతో సమావేశమై డిజిటల్ క్రాప్ బుకింగ్‌పై సూచనలు చేశారు. అలాగే, పీఎం కిసాన్‌ను సంబందించి ఈ–కేవైసీ, ఆధార్ సీడింగ్, రైతు బీమా వివరాల సేకరణపై చర్చించారు. అతర్వాత చింతకాని మండలం చింతకాని, నేరడ, తిమ్మినేనిపాలెంల్లో డిజిటల్ క్రాప్ బుకింగ్‌ను డీఏఓ పరిశీలించారు. అలాగే, మొక్కజొన్నలో తెగుళ్ల నివారణపై రైతులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో ఏఓలు పసునూరి వినయ్‌కుమార్, మానస, ఏఈఓలు బంధం రజిత, పండగ అనూష, మరీదు త్రివేణి, గోగుల హరికృష్ణ, షేక్ ఉస్సేన్ సాహెబ్, నాగినేని నాగసాయి, తేజ, సుప్రజ, కళ్యాణి, ఆయేషా, రాము తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్‌ఎం, ఏటీడీఓపై కేసు

కారేపల్లి: మండలంలోని రేలకాయపల్లి ఆశ్రమ పాఠశాల బాలురపై డిప్యూటీ వార్డెన్ లైంగిక వేధింపులకు పాల్పడినట్లు తేలడంతో సస్పెండ్ చేయడమే కాక తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోక్సో కేసు నమోదు చేశారు. అయితే, ఘటనపై పోలీసుల సమాచారం ఇవ్వకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించి ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం(ఎఫ్ఏసీ) ఎన్.శ్రీనివాసరావు, విచారణ చేపట్టిన ఏటీడీఓ జహీరుద్దీన్‌పైనా కారేపల్లి పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. గతనెల 20వ తేదీన డిప్యూటీ వార్డెన్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు వచ్చినా అంతర్గత విచారణ చేపట్టారే తప్ప తమకు సమాచారం ఇవ్వనందున కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుండెపోటుతో జమలాపురం ఆలయ అర్చకుడు మృతి


వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి (ఫైల్)

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు కురవి వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి(56) గుండెపోటుతో మృతి చెందారు. మంగళవారం ఉదయం ఇంటి వద్దే ఆయనకు గుండెపోటు రాగా అక్కడికక్కడే కన్నుమూశారు. ప్రతినిత్యం స్వామి కల్యాణ క్రతువు నిర్వహించే సుబ్రహ్మణ్యశాస్త్రి మృతిపై పలువురు సంతాపం ప్రకటించారు. ఆలయ ఈఓ కె.జగన్మోహన్‌రావు, వ్యవస్థాపక ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరింటెండెంట్ విజయకుమారి తదితరులు ఆయన మృతదేహం వద్ద నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

కొణిజర్ల: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమాన లారీ రోడ్డు పక్కన బోల్తా పడింది. కొణిజర్లలో మంగళవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటన వివరాలు... మహారాష్ట్రలోని బ్రహ్మపూర్ నుంచి చేపల ఎరువు లోడుతో ఏపీలోని భీమవరానికి లారీ వెళ్తోంది. కొణిజర్ల ఎంపీడీఓ కార్యాలయం సమీపాన ఎదురుగా వస్తున్న వాహనాన్ని డ్రైవర్ తప్పించే యత్నంలో అదుపు తప్పి రోడ్డు పక్కన బోల్తా పడింది. డ్రైవర్ రాయుడు వెంకటేష్, క్లీనర్ చంద్రంకు గాయాలయ్యాయి. అయితే, అక్కడి కాల్వ పక్కన లారీ పడడంతో ఇరువురు ప్రమాదం నుంచి బయటపడినట్లు స్థానికులు తెలిపారు.

సమష్టి కృషితో నిరంతర విద్యుత్ సరఫరా

వేసవి సన్నద్ధతపై సమీక్షలో ఎస్ఈ సురేందర్


సమీక్షలో మాట్లాడుతున్న ఎస్ఈ సురేందర్, పక్కన అధికారులు

ఖమ్మంవ్యవసాయం: వేసవిలో అంతరాయాలు లేని విద్యుత్ సరఫరాకు ఉద్యోగులంతా సమష్టి కృషి చేయాలని ఖమ్మం ఎస్ఈ ఏ.సురేందర్ సూచించారు. డివిజనల్ ఇంజనీర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లతో వేసవి విద్యుత్ సరఫరా సన్నద్ధతపై ఖమ్మంలో మంగళవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. వేసవి కార్యాచరణ మేరకు నాలుగు డివిజన్ల పరిధిలో అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఆస్పత్రులు, ఇతర అత్యవసర సర్వీసులకు ప్రత్యామ్నాయ పద్ధతిలో విద్యుత్ సరఫరా చేసేలా లైన్ల వ్యవస్థను పటిష్ఠంగా మార్చాలన్నారు. ఇప్పటికే 13 సబ్ స్టేషన్లలో లోడ్‌కు అనుగుణంగా పవర్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేయగా, ఇంకా అవసరమైతే ప్రతిపాదనలు అందించాలని, 33, 11 కేవీ లైన్ల మరమ్మతులు పూర్తిచేయాలని సూచించారు. డివిజన్ల ఇంజనీర్లు నాగేశ్వరరావు, రామారావు, రాములునాయక్, శ్రీనివాస్, బాబురావు, అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్లు పాల్గొన్నారు.

ప్రత్యేక లైన్లు, పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు

రఘునాథపాలెం/నేలకొండపల్లి/ఖమ్మం అర్బన్: వేసవి కార్యాచరణలో భాగంగా రఘునాథపాలెం పరిధిలోని మూడు విద్యుత్ సబ్‌స్టేషన్ల ద్వారా మెరుగైన విద్యుత్ సరఫరా చేసేలా జరిగేలా రూ.20 లక్షల వ్యయంతో ప్రత్యామ్నాయ లైన్లను ఏర్పాటు చేశారు. ఈ లైన్లను ఎస్ఈ సురేందర్ మంగళవారం ప్రారంభించారు. అలాగే, నేలకొండపల్లి మండలం ముజ్జుగూడెం విద్యుత్ సబ్ స్టేషన్‌లోనూ ఇంటర్ లింక్ లైన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఇక ఖమ్మం ఖానాపురంలోని 33/11 కేవీ విద్యుత్ కేంద్రంలో 5ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ స్థానాన రూ.90 లక్షల వ్యయంతో 8ఎంవీఏ సామర్థ్యం గల పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయగా మంగళవారం విద్యుత్‌శాఖ డీఈ రామారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో విద్యుత్ శాఖ అధికారులు సంజీవ్‌కుమార్, శంకర్, చింతమళ్ల నాగేశ్వరరావు, కోక్యానాయక్, భద్రుపవార్, వై.రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటలు పరిశీలించిన శాస్త్రవేత్తలు


ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

వైరారూరల్/కొణిజర్ల: వైరా మండలంలోని గన్నవరంలో రైతులు సాగు చేస్తున్న ఆయిల్ పామ్ తోటలను మంగళవారం కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ చైతన్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఒకటి, రెండేళ్ల వయసు గల పామ్ చెట్లకు మొవ్వ కుళ్లు తెగులు ఆశించినట్లు గుర్తించారు. ఈమేరకు తెగులు సోకిన మొవ్వ భాగాన్ని తొలగించి 100 మి.లీ. నీటిలో కార్బెండిజమ్ 20 గ్రాములను కలిపి ముద్దలా మార్చి తెగులు సోకిన ప్రదేశంలో రాయాలని సూచించారు. అలాగే, లీటర్ నీటిలో మోనోక్రోటోఫాస్ ద్రావణం ఒక మి.లీ. కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. మండల వ్యవసాయశాఖ అధికారి మయాన్ మంజుఖాన్, ఏఈఓ సైదులు, రైతులు పాల్గొన్నారు. అలాగే, కొణిజర్ల మండలం తనికెళ్లలోని రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో వరి వెదజల్లే విధానం, మిర్చి సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రవికుమార్, చైతన్య అవగాహన కల్పించారు. కూలీల కొరత నేపథ్యాన వరి సాగు చేసే రైతులు వెదజల్లే విధానం పాటించాలని సూచించారు. వరి పిలక దశలో ఉన్న నేపథ్యాన ఆకుముడత నివారణకు అధికారులు సూచించే క్రిమి సంహారక మందులు పిచికారీ చేయాలన్నారు. మిర్చిలో కాయకుళ్లు తెగులు నివారణకు వివిధ రకాల మందులు మార్చి మార్చి పిచికారీ చేయాలని తెలిపారు. అలాగే, మామిడి పూతకు తేనె మంచు పురుగు ఆశించే అవకాశమున్నందున ఎసిటామీప్రిడ్ లేదా ఇమిడాక్లోప్రిడ్ మందును నీటిలో కలిపి చెట్టు తడిచేలా పిచికారీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి డి.బాలాజీ పాల్గొన్నారు.

కమ్మ మహాజన సంఘం కమిటీ ఏకగ్రీవం


ఏకగ్రీవంగా ఎన్నికైన కమ్మ మహాజన సంఘం కమిటీ

ఖమ్మంమయూరిసెంటర్: కమ్మ మహాజన సంఘం జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవమైంది. ఎన్నిక కోసం నామినేషన్లు స్వీకరించగా ప్రధాన పదవులతో పాటు కార్యవర్గ సభ్యుల పోస్టులకు సైతం ఒక్కో సెట్ మాత్రమే రావడంతో నూతన కమిటీ ఏకగ్రీవమైందని ఎన్నికల అధిఆరులు ప్రకటించారు. ఈమేరకు సంఘం జిల్లా అధ్యక్షుడిగా కొల్లు రఘు సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా కర్నాటి రమాదేవి, ప్రధాన కార్యదర్శిగా చావా రాము, సంయుక్త కార్యదర్శిగా వజ్జా శ్రీనివాసరావు, కోశాధికారిగా తుళ్లూరి నిర్మల కుమారి ఎన్నికయ్యారు. అలాగే, కార్యవర్గ సభ్యులుగా తుమ్మలపల్లి నాగేశ్వరరావు, మోతుకూరు సత్యం, మేదరమెట్ల స్వరూపరాణి, నంబూరి ప్రసాద్, డాక్టర్ పోతినేని భూమేశ్వర్, నల్లమల ఆనంద్, కోలేటి నవీన్‌తో పాటు కోఆప్షన్ సభ్యులుగా తాళ్లూరి మురళీకృష్ణ, బండి రవికుమార్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు నల్లమల నవీన్ చైతన్య, ఎం.సుబ్బయ్య వెల్లడించారు. కాగా, నూతన కమిటీని సంఘం పెద్దలు, సభ్యులు అభినందించారు.

గూడ్స్ రైలులో సాంకేతిక లోపం

సిగ్నల్ వద్ద 20 నిమిషాలు నిలిపివేత


గేట్ తెరవకపోవడంతో నిలిచిన వాహనదారులు

కారేపల్లి: భద్రాచలం రోడ్డు(కొత్తగూడెం) నుంచి డోర్నకల్ వైపు బొగ్గులోడుతో వెళ్తున్న గూడ్స్ రైలులో సాంకేతిక లోపం తలెత్తడమే కాక ఒక బోగీ నుంచి పొగ వెలువడటంతో అప్రమత్తమైన రైల్వే అధికారులు కారేపల్లి రైల్వేస్టేషన్ సమీపాన సిగ్నల్స్ వద్ద రైలును నిలిపేశారు. మంగళవారం బొగ్గు లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలు ఓ బోగీలో నుంచి పొగ వస్తుండగా ఇల్లెందు రైల్వేగేట్(2కేకే) వద్ద గేట్‌మెన్ గమనించాడు. ఆయన కారేపల్లి స్టేషన్ మాస్టర్‌కు సమాచారం ఇవ్వగా లోకోపైలట్‌ను అప్రమత్తం చేసి పేరుపల్లి రైల్వే గేట్(1కేకే) దాటాక కారేపల్లి జంక్షన్ సమీపంలో వద్ద నిలిపివేశారు. అనంతరం రైల్వే అధికారులు పరిశీలించి పొగ తగ్గాక గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. సుమారు 20నిమిషాల పాటు గూడ్స్ రైలు నిలిచిన కారణంగా ఇల్లెందు, పేరుపల్లి రైల్వేగేట్లను తెరవపోవడంతో ఇరువైపులా వాహనదారులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు.